క్లుప్తంగా

తైబజారు వేలాన్ని దక్కించుకున్న సుధాకర్

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తైబజారు వేలంను పి.సుధాకర్ రూ.32.77 లక్షలకు దక్కించుకున్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం ఉదయం 12 గంటలకు బహిరంగ వేలం నిర్వహించారు. 2023 ఏప్రిల్ మాసం నుంచి 2024 సంవత్సరం మార్చి 31వరకు తైబజారు రుసుం వసూలు చేసుకునే హక్కులను లీజుకు ఇచ్చేందుకు ఈ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కమిషనర్ వాణిరెడ్డి మాట్లాడుతూ తైబజార్ నిబంధనల ప్రకారమే రుసుం వసూలు చేయాలన్నారు.

శ్రీరాముడి గుణగణాలను అలవర్చుకోవాలి



లవ, కుశ వేషధారణలో విద్యార్థులు

బోడుప్పల్: విద్యార్థులు శ్రీరాముడి గుణగణాలను అలవర్చుకుని ఉత్తమ పౌరులుగా పేరుగడించాలని పల్లవి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తనూజ అన్నారు. బోడుప్పల్‌లోని పల్లవి మోడల్ స్కూల్‌లో బుధవారం నిర్వహించిన శ్రీరామ నవమి ఉత్సవాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హక్కులకంటే బాధ్యత గొప్పదన్నది రామతత్వం, కష్టంలో కలిసి నడవాలన్నది సీతతత్వం, కుటుంబ బాధ్యత పంచుకోమంటుంది లక్ష్మణతత్వం, నమ్మిన వారికోసం తెగించమంటోంది ఆంజనేయతత్వం అన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బోడుప్పల్‌లో స్వచ్ఛ మషాల్ మార్చ్



స్వచ్ఛ మషాల్ మార్చ్‌లో మహిళలు

బోడుప్పల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బోడుప్పల్‌లో మహిళలు 'స్వచ్ఛత మహోత్సవ్–2023'లో భాగంగా స్వచ్ఛ 'మషాల్ మార్చ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మంజులత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత(విన్స్) కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మెప్మా అధికారి భార్గవి, మహిళా సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మల్కాజిగిరి పీఎస్ డీఐగా రవిబాబు



మల్కాజిగిరి: మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ డీఐ(డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్)గా ఎస్.రవిబాబు బాధ్యతలు స్వీకరించారు. సరూర్‌నగర్ డీఐగా పనిచేస్తున్న రవిబాబు మల్కాజిగిరి పీఎస్‌కు బదిలీపై వచ్చారు.

ఆకట్టుకున్న భరతనాట్యం



అల్వాల్: అల్వాల్ హరిదాస మండపం వద్ద 72వ వసంత నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం కళారంజని స్కూల్ ఆఫ్ డాన్స్ నిర్వాహకులు శ్యామల శ్రీనివాస్ ఆధ్వర్యంలో భరతనాట్యం చేశారు. సంకీర్తన సంఘం సభ్యులు అందకట్ల సుదర్శన్‌రెడ్డి, మాధవ్, శ్రీనివాస్‌రావు, రామకృష్ణ పాల్గొన్నారు.

హోంగార్డుకు అభినందనలు

మల్కాజిగిరి: మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న పండి రమేష్ చందర్ రాష్ట్రస్థాయి అవార్డు పొందారు. 25 ఏళ్లుగా వృత్తిలో అంకితభావంతో పనిచేసినందుకు 'అతి వృత్రిష్ట్' అవార్డు అందుకున్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ నరేష్‌రెడ్డి, సీఐ రవికుమార్, డీఐ రవిబాబు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐలు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రసాద్, మల్లయ్య, లక్ష్మయ్య, సతీష్ పాల్గొన్నారు.



రమేష్‌ను అభినందిస్తున్న ఏసీపీ నరేష్‌రెడ్డి

ఐదేళ్లుగా నరకయాతన

- రాజుకుంటున్న ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ చిచ్చు
- పనుల్లో జాప్యంపై తీవ్రంగా మాటల యుద్ధం
- నువ్వంటే.. నువ్వే అంటున్న బీఆర్ఎస్, బీజేపీ
- నిత్యం అవస్థలు పడుతున్న వేలాది మంది



నిలిచిపోయిన ఉప్పల్ టు నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులు

ఉప్పల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య స్కైవే ఎలివేటెడ్ కారిడార్ చిచ్చు రాజుకుంటోంది. అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకుల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరుకుంటోంది. స్కైవే నిర్మాణ పనుల్లో జాప్యానికి కారణం నువ్వు అంటే నువ్వే అంటూ.. బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. రెండు రోజుల క్రితం సామాన్య పౌరుడు స్కైవే పనుల జాప్యాన్ని ప్రశ్నిస్తూ.. రోడ్డు సరిగ్గా లేక అనేక సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నాం.. ఇంకెన్నాళ్లు ఇబ్బందులు పడాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌కు ట్వీట్ చేశాడు. అది మా జాప్యం కాదు ప్రాజెక్టుకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహిస్తోందని సమాధానం వచ్చింది. ఇది చాలదన్నట్లు రాత్రికి రాత్రే 'మోదీగారు.. ఈ ఫ్లైఓవర్ ఇంకెన్నాళ్లు కడతారు అంటూ..' పని ప్రారంభం తేదీని తెలుపుతూ బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడిపల్లి ప్రాంతాల్లో వాల్ పోస్టర్లు వెలిశాయి. దీంతో బీజేపీ భగ్గుమంది. తప్పు ప్రభుత్వానిది పెట్టుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీపై విమర్శలు చేయడాన్ని తప్పుబట్టింది.

ఉప్పల్ డీఎస్ఎల్ మాల్ వరకు..

ఉప్పల్ నుంచి నారాపల్లి వరకు 6.2 కిలో మీటర్ల స్కైవే నిర్మాణ పనులు జూన్ 2018లో ప్రారంభమయ్యాయి. అత్యంత ఆధునిక టెక్నాలజీ వాడుతూ ఈ నిర్మాణం కొనసాగుతోంది. దాదాపు 168 పిల్లర్లు, ఏడు కిలోమీటర్ల పొడవుతో నిర్మించ తలపెట్టిన పనులను కేంద్రమంత్రి నితిన్ గడ్కారీ చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. పనులు జూన్ 2020కి ముందే పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటికీ కేవలం 60 శాతం వరకే పనులు పూర్తయినట్లు సమాచారం. ఉప్పల్ ఎలక్ట్రికల్ జంక్షన్ నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా కారిడార్‌ను ఎక్స్‌టెన్షన్ చేసి ఉప్పల్ డీఎస్ఎల్ మాల్ వరకు పొడగించారు. ఈ కారిడార్ నారపల్లి సీపీఆర్ఐ వద్ద ముగుస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్ట్ వ్యయం దాదాపు రూ.625 కోట్లు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే..



ఉప్పల్ చౌరస్తాకు ర్యాలీగా తరలివస్తున్న బీజేపీ శ్రేణులు

ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ నేతృత్వంలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని, రోడ్ల మీద అసత్య ప్రచారాలు చేయడాన్ని నిరసిస్తూ ఉప్పల్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేవలం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే కారిడార్ పనులు నిలిచిపోయాయని, వారి అసమర్థతను నరేంద్ర మోదీపై రుద్దుతున్నారని దుయ్యబట్టారు. కేవలం ఆరు నెలల్లోనే జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో వీధి లైట్ల స్తంభాలు, ఇతర పోల్స్, డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరించడం, తాగు నీటి పైపులైన్ మార్చడం వంటివి చేస్తామని వాగ్దానం చేసినప్పటికీ ఐదేళ్లు గడిచినా పత్తాలేదని ఆరోపించారు. దీనికి పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ శాఖ మంత్రి, జీహెచ్ఎంసీ అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నెల రోజుల్లో పైపులైన్ మార్చాలని, స్తంభాలను తొలగించాలని, భూసేకరణ చేపట్టి కారిడార్ పనులను వేగంగా పూర్తి చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచి కారిడార్ పనులు పూర్తి చేయిస్తామని హెచ్చరించారు.

లెఫ్టినెంట్ కల్నల్ కుటుంబానికి అండగా ఉంటాం



వీవీబీ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



బాలుడి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హన్మంతరావు

మల్కాజిగిరి: అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగిన హెలికాప్టర్ కూలిన దుర్ఘటనలో మృతి చెందిన లెఫ్టినెంట్ కల్నల్ వీవీబీ రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బుధవారం స్థానిక కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్‌తో కలిసి వీవీబీ రెడ్డి కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి చేయూత అందిస్తామన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

సీఫెల్ కాలనీలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బుధవారం అధికారులతో కలిసి ఆయన కాలనీలో పర్యటించారు. పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. డీసీ రాజు, ఈఈ లక్ష్మణ్, డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, జలమండలి జీఎం సునీల్‌కుమార్, మేనేజర్ నాయుడు, జీఎన్వీ సతీష్‌కుమార్, పిట్ల శ్రీనివాస్, గుండా నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి కుటుంబ సభ్యులకు పరామర్శ

మౌలాలి: ఆర్టీసీ కాలనీలో ఇటీవల చెత్త ఆటో కింద పడి మృతిచెందిన బాలుడి కుటుంబసభ్యులను బుధవారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పరామర్శించారు. కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తానని, అండగా ఉంటామని ఆయన తెలిపారు. కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, జీఎన్వీ సతీష్‌కుమార్, పిట్ల శ్రీనివాస్, గుండా నిరంజన్, భాగ్యనంద్‌రావు, సత్తయ్య, సయ్యద్ మబు, ఇబ్రహీం, నవాబ్, సంతోష్‌గుప్తా, బాబు, సత్యనారాయణ, పార్థు ఉన్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని వాణినగర్‌లో రూ.37 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రారంభించారు. మల్కాజిగిరి సర్కిల్ ఉపకమిషనర్ రాజు, డీఈ లౌక్య, నాయకులు మేకల రాముయాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో రహదారులన్నీ అధ్వానం



మాట్లాడుతున్న కార్పొరేటర్ రాసాల వెంకటేశ్‌యాదవ్

బోడుప్పల్: అధికారుల నిర్లక్ష్యం వల్ల బోడుప్పల్‌లో ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా మారాయని అధికార పార్టీ 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకవర్గం కౌన్సిల్‌లో 258 పనులకు రూ.43 కోట్లను తీర్మానం చేసి, మంత్రి చామకూర మల్లారెడ్డి చేతులమీదుగా శంకుస్థాపనలు చేసినట్లు వెల్లడించారు. మంత్రి చేతులమీదగా కొబ్బరి కాయలు కొట్టినా పనులకు దిక్కులేదన్నారు. అన్ని రకాల పన్నులు ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారని, అలాంటప్పుడు మౌలిక వసతులు ఎందుకు కల్పించరని ప్రశ్నించారు. ఇదే విషయంపై గతంలో కమిషనర్‌కు వినతి పత్రం అందజేసినా స్పందన కరువైందన్నారు. ఈ నెల 31వ తేదీలోపు రోడ్డు పనులు చేపట్టకపోతే నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నేతలు కామగల్ల నర్సింహ, పడతం లోకేష్, మిట్టపల్లి సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ యాదవ్, కృష్ణారెడ్డి, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

హాథ్ సే హాథ్ జోడో యాత్రకు స్పందన



రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్



ఈసీఐఎల్‌లో కాగడాల ప్రదర్శనలో కాంగ్రెస్ శ్రేణులు

అల్వాల్: కాంగ్రెస్ హయాంలోనే మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందిందని మేడ్చల్–మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. హాథ్ సేథ్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా బుధవారం ఆయన వెంకటాపురం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకొని అధికారులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, సంజీవ్‌కుమార్, చంద్రశేఖర్, జోలి రమేష్, శివకుమార్, శంకర్, పాండు, పవన్, సాయికుమార్, శేఖర్, పద్మ, ఆశారాణి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ మద్దతుగా కాగడాల ప్రదర్శన

కుషాయిగూడ: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై అనర్హత వేటును నిరసిస్తూ బుధవారం ఉప్పల్ నియోజకవర్గం బీ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కాగడాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసీఐఎల్ చౌరస్తా నుంచి రాధిక చౌరస్తా వరకు సాగిన నిరసన ప్రదర్శనలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. మోదీ తీరును దేశ ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కాంగ్రెస్ నాయకులు మేకల శివారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పత్తికుమార్, రాఘవరెడ్డి, అంజిరెడ్డి, పెద్ది శ్రీనివాస్, శ్రీను, అనిల్, మొసలి శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

నిర్లక్ష్యంపై మల్లాపూర్‌వాసుల ఆగ్రహం

కాప్రా: తమ కాలనీలో మురుగు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట మల్లాపూర్ వాసులు ధర్నాకు దిగారు. కాలంగా మల్లాపూర్ ఎస్ఎల్ఎన్ ఫంక్షన్, కృష్ణవేణి స్కూల్ సమీపంలో మురుగు సమస్యతో స్థానిక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు నెలల క్రితం డ్రైనేజీ ఇతర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ అధికారుల సమక్షంలో శంకుస్థాపన చేసినా ఇంతవరకు పనులు మొదలు కాలేదని అసహనం వ్యక్తం చేశారు.



కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట మల్లాపూర్‌వాసుల ధర్నా

నియామకం



అల్వాల్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా కార్యదర్శిగా అల్వాల్‌కు చెందిన ఎస్.తిరుపతిరెడ్డి నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు ఏ.తిరుపతి బుధవారం తిరుపతిరెడ్డికి నియామక పత్రం అందజేశారు.

ఘనంగా స్నాతకోత్సవం

కాప్రా: ఈసీఐఎల్‌లోని రవీంద్రభారతి స్కూల్‌లో బుధవారం ప్రీప్రైమరీ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ప్రీప్రైమరీ పూర్తి చేసుకుని యూకేజీలో అడుగు పెడుతున్న సందర్భంగా స్కూల్ యాజమాన్యం ఈ స్నాతకోత్సవం నిర్వహించింది. ముఖ్యఅతిథిగా మేడ్చల్ మాల్కాజిగిరి జిల్లా కోర్టు న్యాయవాది గీతాంజలి హాజరయ్యారు.

14 నుంచి ఇంటింటికీ సీపీఐ



మాట్లాడుతున్న బాలమల్లేష్

కాప్రా: సమస్యల పరిష్కారానికి ఇంటింటికీ సీపీఐ పేరుతో పాదయాత్ర నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలమల్లేష్ అన్నారు. ఈసీఐఎల్‌లోని పార్టీ కార్యాలయం నీలం సంజీవరెడ్డి భవన్‌లో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బాలమల్లేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. ఇంటింటికీ సీపీఐ పేరుతో వచ్చేనెల 14 నుంచి మే 15 వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు సాయిలుగౌడ్, దామోదర్‌రెడ్డి, ఉమామహేష్, శంకర్‌రావు, ధర్మేంద్ర, కిషన్, హరినాథ్‌రావు, వెంకట్‌రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యప్రసాద్, నాయకులు సల్మాన్, ప్రవీల, గిరి తదితరులు పాల్గొన్నారు.

పిల్లర్లపై ఫొటోలు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మేడిపల్లి: దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీని కించపరుస్తూ వరంగల్ జాతీయ రహదారిపై ఉన్న పిల్లర్లకు గుర్తు తెలియని వ్యక్తులు ఫొటోలు వేసి కించపరిచారని వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పీర్జాదిగూడ బీజేపీ ఆధ్వర్యంలో మేడిపల్లి ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పీర్జాదిగూడ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు నమిలికొండ అనిల్‌రెడ్డి, నాయకులు గిరిగౌడ్, శ్రీనివాస్, సుగుణ, మోహన్‌యాదవ్, వీరయ్య, సంకీర్త ఉన్నారు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్త

కుషాయిగూడ: ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కుషాయిగూడ డివిజన్ షీ టీం హెడ్‌కానిస్టేబుల్ బి.శ్రీనివాస్ సూచించారు. కుషాయిగూడ డివిజన్ పరిధిలోని చర్లపల్లి, రాంపల్లి, జవహర్‌నగర్, యాప్రాల్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఫోన్లలో అనవసరమైన యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దన్నారు. కొన్ని యాప్‌ల కారణంగా ఫోన్‌లోని డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతుందన్నారు. ముఖ్యంగా పిల్లలు ఫోన్లు వాడే సమయంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఇంట్లో వారికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కానిస్టేబుల్ శిల్పతో పాటు ఆయా పాఠశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

మోడ్రన్ వైకుంఠధామంగా తీర్చిదిద్దుతాం

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని ఎర్రకుంట హిందూ శ్మశానవాటికను మోడ్రన్ వైకుంఠధామంగా తీర్చిదిద్దుతామని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి శ్మశానవాటికను పరిశీలించారు. వైకుంఠధామంలో కావాల్సిన సౌకర్యాలపై ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ లింగారావు, అధికారి సోహెల్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, కాలనీవాసులు శ్రీరామ్ సత్యనారయణ, గద్ద యుగంధర్, దాసరి కర్ణ, జంగం అశోక్, భిక్షపతి, బాలరాజ్ తదితరులు ఉన్నారు.

వైద్య కోసం దూరం వెళ్లాలంటే ఇబ్బందులు

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ బాక్-3 బస్తీలో బస్తీ దవాఖానాను ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డికి స్థానిక బస్తీవాసులు వినతి పత్రం అందజేశారు. బస్తీలో అధికంగా పేదలు నివాసం ఉంటున్నారని, వారికి వైద్య కోసం దూరం వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదని అన్నారు. అధికారులతో మాట్లాడి బస్తీ దవాఖానాను ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తానని వారికి కార్పొరేటర్ హామీ ఇచ్చారు. బోదాసు లక్ష్మీనారాయణ, ఖాసీత్‌ఖాన్, మురళి, చంద్రశేఖర్, రాము, శ్రీను, శ్రీకాంత్, వెంకటేష్ ఉన్నారు.

ఆర్థిక సాయం కోసం ఇంటర్వ్యూలు

ఉప్పల్: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మైనార్టీ అల్పాదాయం ఉన్నవారికి ఆర్థిక సాయం అందజేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఉప్పల్ సర్కిల్ డీసీ అరుణకుమారి తెలిపారు. ఇప్పటికే ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఆన్‌లైన్ పత్రాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, అన్ని పత్రాలతో ఏప్రిల్ ఒకటో తేదీన ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలలోపు ఉప్పల్ సర్కిల్ కార్యాలయానికి హాజరుకావాలని కోరారు.

అభివృద్ధికి నిధులివ్వండి

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బుధవారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజను కలిసి వినతి పత్రం అందజేశారు. డివిజన్‌లోని బీరప్పగడ్డ రామాలయం నుంచి శ్రీనగర్‌కాలనీ వరకు, హనుమాన్ టెంపుల్ నుంచి మరల మైసమ్మ దేవాలయం వరకు, మిగతా కొన్ని కాలనీలకు సీసీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాకాలం వరకు రోడ్లు పూర్తయ్యేలా చూడాలని కోరారు. అందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

స్వచ్ఛతపై ర్యాలీ

మేడిపల్లి: అంతర్జాతీయ జీరో వ్యర్థాల దినోత్సవాన్ని పురస్కరించుకొని కమిషనర్ డాక్టర్ పి.రామకృష్ణరావు ఆధ్వర్యంలో మహిళా కార్పొరేటర్ల నేతృత్వంలో బుధవారం పీర్జాదిగూడ కార్పొరేషన్ కార్యాలయం నుంచి స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తడి పొడి, హానికర చెత్తను క్షేత్రస్థాయిలో వేరుచేయడం, ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మేయర్ సతీమణి క్రాంతి, కార్పొరేటర్లు బొడిగే స్వాతికృష్ణగౌడ్, కుర్ర శాలిని శ్రీకాంత్‌గౌడ్, బండారి మంజులరవీందర్, ప్రసన్నలక్ష్మీశ్రీధర్‌రెడ్డి, బండి రమ్యసతీష్‌గౌడ్, మాడుగుల చంద్రకళచంద్రారెడ్డి, దొంతికి హరిశంకర్‌రెడ్డి, బచ్చ రాజు తదితరులు ఉన్నారు.

ఇంటి పన్నులు తగ్గించాలంటూ బీజేపీ ధర్నా



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

బోడుప్పల్: ఇంటి పన్నులు, నీటి ఫీజులు తగ్గించాలని కోరుతూ బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ మాట్లాడుతూ అధ్వానంగా ఉన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని, పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలని, జీవో నంబర్–211 ప్రకారం ఇంటింటికీ 20వేల లీటర్ల నీటిని ఉచితంగా అందించాలన్నారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్పొరేటర్లు కుంభం కిరణ్ కుమార్‌రెడ్డి, సామల పవన్‌రెడ్డి, నేతలు రాసాల నర్సింగ్‌రావు, ఎస్ఎన్ ప్రగతి, దేవరకొండ వెంకటాచారి, మాడుగుల శివయాదవ్ పాల్గొన్నారు.

జెడ్సీ మమతకు వినతి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ బుధవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమతకు వినతి పత్రం అందజేశారు. మచ్చబొల్లారం డివిజన్‌లో కొత్త పార్కుల అభివృద్ధి, ఐస్ ఫ్యాక్టరీ నుంచి సాయి బృందావన్ రోడ్డుకు మరమ్మతులు, ఎస్ఎన్‌డీపీ బాక్స్ డ్రైయిన్ల నిర్మాణం తదితర పనులు చేపట్టాలని వినతి పత్రంలో కోరారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి

అల్వాల్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం అల్వాల్ డివిజన్ పరిధిలోని వెస్ట్ వెంకటాపురంలో రూ.12 లక్షలతో కొనసాగుతున్న సీవరేజ్ లైన్ పనులను ఆమె జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ఓల్డ్ అల్వాల్‌లోని రామాలయం సమీపంలో మురుగు కాల్వ పూడిక తీయాలని అధికారులను ఆదేశించారు.